క్లుప్తంగా

కోనేటిరాయుని కల్యాణోత్సవానికి విరాళం

గంగవరం: టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవ సేవకు దాతల నుంచి రూ.10వేలు విరాళంగా అందినట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర శనివారం తెలిపారు. దాతలు బెంగళూరుకు చెందిన శశికుమార్ నుంచి విరాళాన్ని స్వీకరించినట్టు పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ శ్రవణా నక్షత్రం రోజున ఆలయంలో జరిగే శ్రీవారి కల్యాణోత్సవానికి విరాళాన్ని వినియోగిస్తున్నట్టు తెలిపారు.

బిల్లేరులో ప్రవచనాలు


ప్రవచనాలను వల్లిస్తున్న నాగభూషణాచారి

చౌడేపల్లె: కొండయ్యగారిపల్లె పంచాయతీ బిల్లేరు రామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో వేదపండితులు నాగభూషణాచారిచే ప్రవచనాలు నిర్వహించారు. శనివారం గ్రామంలోని మహిళలు శ్రావణమాసపు శనివారం సందర్భంగా ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. నాలుగు రోజులపాటు ప్రవచనాల తరువాత స్వామివారి దంపతులకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

రొంపిచెర్ల: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన రొంపిచెర్లలో శనివారం జరిగింది. పీలేరుకు చెందిన ఓ సినిమా థియటర్‌ను లీజుకు తీసుకున్న వ్యక్తి కారులో ఎర్రావారిపాళెం వైపు వెళుతుండగా రొంపిచెర్ల వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు రిటైర్డ్ టీచర్ విశ్వనాథరెడ్డి (62)కి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రుయా ఆస్పత్రికి తరలించారు. రొంపిచెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లె: గర్భిణులు వైద్యుల సలహాలను పాటిస్తూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో శనివారం మహతి ఫౌండేషన్ సహకారంతో ప్రధానమంత్రి సురక్షిత మాతృ అభియాన్ కార్యక్రమం ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం రేపు

సదుం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మ దినం సందర్భంగా సోమవారం రక్తదానశిబిరం నిర్వ హిస్తున్నట్టు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్, కుంచ ప్రభావతమ్మ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందని వెల్లడించారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత రక్తదానశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కుంచ పద్మావతమ్మ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ కుంచ లక్ష్మీపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి రుయా ఆస్పత్రికి చెందిన బస్సును ఏర్పాటు చేశారని తెలిపారు.


కమనీయం..కల్యాణం


సీతారాముల కల్యాణం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని 102 ఈ రామిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొడిదపల్లెలో శనివారం సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. సర్పంచ్ స్వాతి ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

అవగాహనతో మానసిక సమస్యలకు చెక్

తిరుపతి తుడా: మానసిక సమస్యలను అవగాహనతో అధిగమించవచ్చని రుయా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవి తెలిపారు. రుయా ఆస్పత్రిలో శనివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సే నోట్ సూసైడ్ డోంట్ కిల్ యువర్ సెల్ఫ్ అన్న నినాదంతో ర్యాలీ చేపట్టారు. డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ పిరికితనం వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. ఒత్తిడిని అధిగమిస్తే మానసిక సమస్య దరిచేరవన్నారు. కుటుంబ వ్యవహారాలు, ఆర్థిక సమస్యలు, మన చుట్టూ ఉన్న అనేక సమస్యల కారణంగా ఎక్కువ మంది మానసికంగా కుంగిపోతున్నారని వివరించారు.

ఎనుబోతుల బండ వద్ద గుహకు కట్టిన ఆలయం


కర్ణాటక సరిహద్దులో శిథిలమైన జైనుల ఆలయం


ఎన్నో డి జైనులు!

- పలమనేరులో జైనుల శాసనాలు లభ్యం
- 24వ తీర్థంకురుడైన వర్తమాన మహావీరుని చిహ్నాలు
- పలు జైన ఆలయాలు శిథిలం, కొన్ని హిందూ ఆలయాలుగా మార్పు

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో జైనుల ఆలయాలు, శాసనాల ఆనవాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో జైన మతాన్ని జనం ఆచరించినట్టు తెలుస్తోంది. జైన మతాన్ని ఆచరించేవారు నిర్మించిన ఆలయాలపై 24వ తీర్థంకురుడైన వర్తమాన మహావీరుని చిహ్నం పాము గుర్తు నేటికీ ఆలయాలపై కనిపిస్తోంది. కొన్ని ఆలయాలు శిథిలంకాగా మరికొన్ని ఆలయాలు ప్రస్తుతం హిందూ ఆలయాలుగా రూపాంతరం చెందాయి. ముఖ్యంగా పెద్దపంజాణి మండలంలోని కరసనపల్లిలో అప్పటి జైనుల ఆలయం, శాసనాలు కనిపిస్తున్నాయి.

జైనుల కాలం నాటి ఆలయాలు

నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం కరసనపల్లిలో నేటి చౌడేశ్వరి ఆలయం నాటి జైనుల ఆలయంగానే చరిత్రకారులు చెబుతున్నారు. పుంగనూరు సమీపంలోని సూరకుంట్లలో జైనులు నివాసం ఉన్న జైన గుహలు మునీశ్వరిని కొండపై కనిపిస్తున్నాయి. పుంగనూరుకు సమీపంలోని ఉప్పునెల్లిలో జైన శిల్పాలున్నాయి. ఇక్కడికి సమీపంలోని మినికి, పనపరెడ్డిపల్లి, ఎర్రపల్లి వద్ద ఎనుబోతుల బండలలో జైనుల చారిత్రక ఆధారాలున్నాయి. అదేవిధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లి వద్ద సాధువులు కొండ లేదా సిద్ధుల కొండ సైతం జైనులకు సంబంధించినదిగానే భావిస్తున్నారు. ఇవిగాక పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని ముళబాగల్ తాలుకా కురుడుమల, నగవార గ్రామాల్లో జైనుల ఆలయాలు శిథిలమయ్యాయి.

ఇది జైనుల చరిత్ర

జైన గ్రంథాల మేరకు క్రీ.పూర్వం నాలుగో శతాబ్దానికే కళింగ రాజైన ఖారవేలుని ఆదరణతో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో విరాజిల్లినట్టు తెలుస్తోంది. సుప్రసిద్ధ జైనాచార్యుడైన కొండకుందాచార్యుడు అనంతపూర్ జిల్లాలోని కొనకుండ్లలో ఆశ్రమాన్ని నిర్మించుకుని అక్కడి నుంచి మదనపల్లి, పుంగనూరువైపునకు ఈ మతాన్ని వ్యాపింపజేసినట్టు తెలుస్తోంది. జైనుల ఎక్కువగా గుహల్లో ఉండేవారని గుంటుపల్లి, నెల్లిమర్ల, శాలిహుండం తరహాలో ఇక్కడ గుహలుండడం విశేషం. అదే విధంగా తమిళనాడులోని నాటి నార్త్ ఆర్కాట్ జిల్లా వల్లిమళై ప్రధాన కేంద్రంగా అజ్జనందిన్ అనే ఆచార్యులు చిత్తూరు జిల్లాలో అప్పట్లో ఈ మతాన్ని వ్యాపింపజేసినట్టు తెలుస్తోంది. నార్త్ ఆర్కాట్ జిల్లాను బ్రిటీష వారు పాలించేనాటికే ఇక్కడ ఏడువేల మంది జైన మతాన్ని ఆచరిస్తున్నట్టు వారి కులగణనలో ఉందని సమాచారం.


కరసనపల్లి వద్ద నాటి రాతి శాసనాలు



ఉప్పునెల్లి వద్ద జైనులకు చెందిన రాతిపై చెక్కిన శిల్పాలు

జైన ఆలయాలపై పాము చిహ్నం..

తీర్థంకుల్లో తొలివాడైన వృషభనాథుని నుంచి 23వ తీర్థంకురుడైన పార్శ్వనాథుడు, ఆఖరి 24వ తీర్థంకుడైన వర్తమాన మహావీరుని దాకా ఒక్కొక్కరికి ఓ గుర్తుండేది. ఇందులో భాగంగా ఆఖరి తీర్థంకుని చిహ్నం పాముగా ఉండేది. దీంతో ఇక్కడి నాటి జైనుల ఆలయాలపై పాము చిహ్నం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.


వర్తమాన మహావీరుని పాము చిహ్నం

జైన మతం ఉన్నట్టు ఆధారాలు



పలమనేరు, పుంగనూరు, కర్ణాటక సరిహద్దుల్లో నాడు జైన మతానికి చెందిన ఆలయాలు ఇప్పటికీ పదుల సంఖ్యలో ఉన్నాయి. నాటి శాసనాలు సైతం బండలపై చెక్కారు. ముఖ్యంగా జైనుల నివసించిన పలు గుహలు ఇప్పటికే ఉన్నాయి. దీనిపై పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే పురావస్తుశాఖ స్పందించి ఇక్కడి జైనుల ఆధారాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.
-బత్తలపల్లి మునిరత్నంరెడ్డి, చరిత్ర పరిశోధకులు

చట్టం ఎవరి చుట్టం కాదు


బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

చట్టం ఎవరికీ చుట్టం కాదు. అలా చుట్టంగా ఇన్నాళ్లు చంద్రబాబు ఎన్నో కేసుల్లో స్టే తెచ్చుకున్నారు. ఇన్నాళ్లకు పాపం పండింది. ఇక ఆయన కేసులపై పోరాడి తాను తప్పు చేయలేదని నిరూపించుకోవాలి. అంతేగాని ఇష్టాను సారంగా అధికార పార్టీపై పడికొట్టుకుంటే ఎవరూ పట్టించుకోరు. చేసిన పాపాలు చంకలో పెట్టుకొని ఎవరిపైనో నెపం వేసే కాలం పోయింది.

తప్పుల వల్లే అరెస్ట్

సోమల: చట్టం ఎవరి చుట్టం కాదని నిరూపణ అయ్యిందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ బాషా, వాటర్ షెడ్ వైస్ చైర్మన్ పీఎల్ఆర్ రాజారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్ట్ అవడంపై స్పందించారు. చేసిన తప్పుల వల్లే సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారని, దీనిని కూడా పబ్లిసిటీ కోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రజలు ఇలాంటి నాయకులకు, పార్టీలకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు మునిరాజ, వైఎస్సార్‌సీపీ యూత్ నేతలు ఆటో ప్రసాద్, గన్నా పురుషోత్తం, షావలీ, మంజునాథ్, ముబారక్, దొరబాబు, వసీం పాల్గొన్నారు.

అరెస్ట్‌పై నోరు మెదపని తెలుగు తమ్ముళ్లు

పుంగనూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన చంద్రబాబునాయుడుకు మద్దతుగా పుంగనూరు నియోజకవర్గంలో తమ్ముళ్లు ఎవరూ నోరు మెదపలేదు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరు బాబుకు మద్దతుగా రాకపోవడం గమనార్హం. బంద్‌కు దేశం వర్గాలు పిలుపునిచ్చినా పుంగనూరులో బంద్ ప్రభావం జరగలేదు. ప్రజాజీవనం యథావిధిగా సాగింది.

శ్రీకృష్ణుని అవతారంలో వేంకటేశ్వరుడు


శ్రీకృష్ణుని అవతారంలో వేంకటేశ్వరస్వామి


శ్రీశనేశ్వరస్వామికి పూజలు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారిని కృష్ణుని అవతారంలో అలంకరించి పూజలు చేశారు. అలాగే యాబైరాళ్ల మొరవ వద్ద గల శనేశ్వరస్వామి ఆలయంలో శనేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, హోమాలు, అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై, పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మేమున్నామని..

నగరి: కుటుంబసభ్యులందరూ చనిపోవడం.. అయినవాళ్లు తీవ్రశోకంలో ఉండడం.. నాలుగు మృతదేహాలకు ఏకకాలంలో దహనక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి ఆ కుటుంబానికి రావడంతో ఆత్మబంధువులం తామున్నామంటూ సర్పంచ్‌తో పాటు గ్రామంలోని పెద్దలు, యువకులు ముందుకొచ్చారు. నగరి మున్సిపల్ పరిధి ధర్మాపురం వద్ద జాతీయ రహదారి శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిట్టపాళెంకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన భూపాలన్(29), భార్య నీలావతి(26), కుమారుడు నితిన్(4), ఉమేష్(3) మృతి చెందిన విషయం తెలిసిందే. నాలుగు మృతదేహాలు చేరుకోగానే గ్రామం శోకసంద్రమైంది. బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఈ సమయంలో అంత్యక్రియల నిర్వహణలో గ్రామస్తులు మానవత్వాన్ని చాటుకున్నారు. పాడెలను శ్మశానం దాకా మోసుకెళ్లారు. గ్రామఆచారం ప్రకారం మృతదేహాలను దహనం చేశారు.


పాడెలను మోసుకెళుతున్న గ్రామస్తులు

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం


సూచనలిస్తున్న జిల్లా టీకా అధికారి రవిరాజు

కార్వేటినగరం: డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాజులకండ్రిగ దళితవాడను సందర్శించి విషజ్వరాలపై అవగాహన కల్పించారు. విషజ్వరాల్లో ప్రమాదకరమైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా కలుషిత నీరు తాగడం వల్ల వైరల్ ఫీవర్ వస్తుందని, ప్రతి దానికి ఆర్ఎంపీ వైద్యుల వద్దకు వెళ్లకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి తగిన పరీక్షలు చేయించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వరుసగా రెండు రోజుల పాటు జ్వరం ఉంటే ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థాలను ఇంటి ఆవరణలో లేకుండా చూడాలని తెలిపారు. ఈక్రమంలో భాగంగా దోమల నివారణకు మిలాథిన్ స్ప్రే చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గోపినాథ్, యూసఫ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శనివారం పూజలు

వి.కోట: మండలంలో కృష్ణమ్మ కొండపై వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి వారికి శ్రావణ శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను కొండపై ఊరేగింపుగా ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేయించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరై ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్నారు. కొండ భక్తజనంతో కిటకిటలాడింది. కొండ కింద ఏర్పాటు చేసిన అన్నదానం సాయంత్రం వరకు కొనసాగింది. జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును జెడ్పీ చైర్మన్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణమ్మ కొండను మంత్రి పెద్దిరెడ్డి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులోభాగంగా ప్రస్తుతం ఆలయం అభివృద్ధికి రూ.1.50లక్షలు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కొండపైకి సిమెంటు రోడ్లు, తాగునీటి సౌకర్యం, ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


అన్నదానం


స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎండీయూ ఆపరేటర్ల సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: సమస్యలు పరిష్కరించాలని ఎండీయూ ఆపరేటర్లు కోరారు. వారు శనివారం తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరావుకు వినతి పత్రం అందజేశారు. ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 554 మంది ఎండీయూల ఇన్సూరెన్స్ సొమ్ము త్వరగా ఇప్పించాలన్నారు. ప్రమాదంలో మరణించిన 62 మంది ఆపరేటర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ నెలాఖరులోపు సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని వారికి మంత్రి భరోసా ఇచ్చారు. బి.జేమ్స్, చిన్నబ్బ, దేవా, పురుషోత్తం పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు


తీవ్రగాయాలైన రాజు, నాగ

గంగాధరనెల్లూరు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన అప్పిరెడ్డికండ్రిగ వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. కార్వేటినగరంలోని బీసీ కాలనీకి చెందిన రాజు, నాగ ద్విచక్రవాహనంపై చిత్తూరు వైపు బయల్దేరారు. అదే సమయంలో గంగాధనెల్లూరు మండలంలోని అప్పిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. దీంతో కార్వేటినగరానికి చెందిన రాజు, నాగకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లోక్‌అదాలత్‌లో 742 కేసుల పరిష్కారం



పుంగనూరు: మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు, చిత్రంలో జడ్జిలు కార్తీక్, సింధు

- రూ.50.44 లక్షల చెల్లింపు
- న్యాయమూర్తి వాసుదేవరావు వెల్లడి

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం నిర్వహించారు. అందులో 742 కేసులు పరిష్కరించి, రూ.50.44 లక్షలు చెల్లింపులు చేసినట్లు సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి సింధుతో కలిసి ఆయన లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. సివిల్ కేసులు 32, ఇతర కేసులు 710 పరిష్కరించి నిందితులకు జరిమానా విధించారు. న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులది తుది తీర్పు అని, దీనిపై అప్పీల్ ఉండదన్నారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు పాల్గొన్నారు.

మల్లప్పకొండకు రూ.5 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

కుప్పం: గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామి కుంభాభిషేకానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి రూ.5 లక్షల విరాళం పంపినట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శనివారం ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎంపీ రెడ్డెప్ప చేతులమీదుగా గుడుపల్లె ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ కృష్ణమూర్తి, సర్పంచ్ అమర్‌నాథ్‌తో కలిసి అందజేశారు. ఈనెల 11,12,13 తేదీల్లో కుభాంభిషేక వేడుకలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. వేడుకలకు మంత్రి పెద్దిరెడ్డి రానున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

రాజనాలబండలో తిరునాళ్ల సందడి



రాజనాలబండలో పూజలందుకున్న వీరాంజనేయస్వామి, భక్తులకు అన్నదానం

- ప్రత్యేక పూజలందుకున్న వీరాంజనేయ స్వామి
- తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం నుంచి తిరునాళ్ల సందడి మొదలైంది. శ్రావణమాస చివరి శనివారం, ఆదివారం తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీ. తిరునాళ్లను పురస్కరించుకుని నిర్వాహకులు ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. శనివారం మండలంలోని 18 గ్రామాలకు చెందిన ప్రజలు భక్తిశ్రద్ధలతో రాజనాలబండకు చేరుకుని శ్రీ వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి రాజనాలబండకు సమీపంలో ఎత్తైన కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కాలినడకన చేరుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండపై రాత్రి అఖండ దీపం వెలిగించారు. భక్తులకు జీఆర్ఎస్ రమణ, వెంగళపల్లె యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈసందర్భంగా చేసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ఆకట్టుకుంది. సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది బందోబస్తును ఏర్పాటుచేశారు.


నరసింహస్వామి కొండపై భక్తుల రద్దీ